క్లుప్తంగా

నేడు మంత్రి రాజా పర్యటన

తుని: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా శనివారం తునిలో పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు శుక్రవారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు పురపాలక సంఘంలో లబ్ధిదారులకు మంత్రి రాజా పింఛన్లు పంపిణీ చేస్తారన్నారు. పట్టణ పరిధిలోని లబ్ధిదారులు, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు బ్యాంక్ కాలనీలోని మున్సిపల్ ఉన్నత పాఠశాలకు రావాలని ఆయన కోరారు.

ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయం



తూర్పులక్ష్మీపురంలో ప్రజలకు ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ సభ్యుడు ప్రసాద్

ఏలేశ్వరం: ప్రజారోగ్య పరిరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీటీసీ సభ్యుడు యిజనగిరి ప్రసాద్ అన్నారు. మండలంలోని తూర్పులక్ష్మీపురంలో శుక్రవారం రెండోవిడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. ప్రజల చెంతకే ప్రభుత్వ వైద్య సేవలను తీసుకువచ్చారన్నారు. అనంతరం ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. తొలుత గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

తొండంగి: అన్నవరం రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. సత్యదేవుని ప్రధానాలయంలోని అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, రత్నగిరి మెట్లదారిలో తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి ఘనంగా లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమ గుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



గోకవరం దేవీచౌక్ ఆలయంలో ధాన్యం రాశిపై కనకదుర్గమ్మకు పూజలు

గోకవరం: గ్రామంలో ప్రసిద్ధిగాంచిన దేవీచౌక్ ఆలయంలో కనకదుర్గమ్మకు శుక్రవారం నూతన ధాన్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మార్గశిరమాసాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో కొత్తగా వచ్చిన ధాన్యం రాశిగా పోసి మార్గశిర లక్ష్మీదేవిగా అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు ధాన్యం రాశిలోని లక్ష్మీదేవిని దర్శించుకున్నారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని నూతన ధాన్యంతో పూజలు చేసినట్టు ఆలయ అర్చకులు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేంకటేశ్వరస్వామి సన్నిధిలో అన్నసమారాధన



వేంకటేశ్వరస్వామి ప్రసాదం స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి, బాలు దంపతులు

తుని: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకొని స్థానిక పాత బజారువీధి వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, బాలు దంపతులు వేంకటేశ్వరస్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వారికి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం అన్నసమారాధనను చైర్‌పర్సన్ సుధారాణి ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. దేవస్థానం చైర్మన్ మర్నీడి శ్రీనివాసరావు, ఈవో పి.విశ్వనాథ రాజు, ధర్మకర్తలు, కౌన్సిలర్లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



గోకవరంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



గండేపల్లిలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న తోట నరసింహం



ఏలేశ్వరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అభివృద్ధి, సంక్షేమమే ఊపిరి

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- కోటనందూరులో కొత్త పింఛన్ల పంపిణీ



కోటనందూరు పింఛన్ల పంపిణీ సభలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

కోటనందూరు: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ఊపిరిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆధ్వర్యంలో పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి రాజా ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు రూ.3 వేల పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి రాజా మాట్లాడుతూ వివక్షతకు తావులేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. గత ఎన్నికలకు ముందు చేసిన ప్రజాసంకల్ప పాదయాత్రలో అవ్వాతాతల కష్టాలు తెలుసుకున్న సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు పెంచి వారి కష్టాలను తీర్చారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్‌ను దఫాలుగా రూ.3 వేలకు పెంచారన్నారు.

గతంలో 17 వేల మందికే...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తుని నియోజకవర్గంలో 17 వేల పింఛన్లు ఉంటే ఆ మొత్తం ప్రస్తుతం 40 వేలకు పెరిగిందన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాల్లో సగం కూడా లేవన్నారు. ఎన్నికల వేళ చంద్రబాబు, ఎల్లో మీడియా మాటలు నమ్మొద్దని సూచించారు. పథకాల రూపంలో ప్రజలకు డబ్బు పంచితే రాష్ట్రం శ్రీలంక అయిపోతుందని కట్టుకథలు వల్లించిన ఎల్లో బ్యాచ్ అధికారంలోకి వస్తే జగన్ కన్నా మెరుగైన పథకాలు అందిస్తామని ఎలా చెబుతున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ఎల్లో మీడియా, చంద్రబాబు అండ్ కో ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో దేశంలో 22వ స్థానంలో ఉన్న వ్యవసాయాన్ని జగన్‌మోహన్‌రెడ్డి రెండో స్థానంలో నిలిపారన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, తలసరి ఆదాయంలో రాష్ట్రం ఎంతో మెరుగ్గా ఉందన్నారు. అన్నివర్గాలకూ మంచి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం లబ్ధిదారులకు రూ.3 వేల పింఛన్లు పంపిణీ చేశారు.

నూతన సచివాలయం ప్రారంభం

స్థానిక బస్టాండ్ ప్రాంతంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన కోటనందూరు–2 గ్రామ సచివాలయాన్ని మంత్రి దాడిశెట్టి రాజా ప్రారంభించారు. సచివాలయం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు. సచివాలయ ప్రారంభానికి వచ్చిన మంత్రికి సర్పంచ్ శివలక్ష్మి ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. ఆయా కార్యక్రమాల్లో సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, ఏఏబీ జిల్లా చైర్మన్ లంక ప్రసాద్, లోవ దేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, మాజీ చైర్మన్లు లాలం బాబ్జీ, బొంగు ఉమారావు, ఏఎంసీ చైర్మన్ మాకినీడు బాబు, వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గరిసింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, దార్ల సూర్యచంద్ర, ఉల్లూరి శ్రీను, తోలెం విజయరాజు, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించాలి

గండేపల్లి/జగ్గంపేట: సంక్షేమ సారథి జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం పిలుపునిచ్చారు. గండేపల్లి, జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో తోట నరసింహం, ఆయన తనయుడు తోట రాంజీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. లబ్ధిదారులకు పెంచిన రూ.3 వేల పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్నివిధాలా మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరు మధు, గ్రామ సర్పంచ్ రుత్తల లలిత, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యులు ఒబిణ్ని వీరబాబు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ మూర్తి, పార్టీ నేత కుంచే చినబాబు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక పింఛన్ల పంపిణీ

ఏలేశ్వరం: పట్టణంలోని శుక్రవారం అట్టహాసంగా పెంచిన పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచారు. స్థానిక కోనేటిబడి ఆవరణలో లబ్ధిదారులకు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్లు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోను వందశాతం అమలు చేసిన సీఎం జగన్‌కు ప్రజలు రుణపడి ఉంటారన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కే మళ్లీ పట్టం కట్టాలని కోరారు. పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, సామంతుల హైమావతి, దోశీ కిషోర్, సుంకర రాంబాబు, దేగల వెంకటరమణ, కోరాడ ప్రసాద్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు అందుతున్నాయని ఆ పార్టీ సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, మండల కన్వీనర్ పాటి రాంబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నూతనంగా మంజూరైన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ కె.పద్మజ్యోతి అధ్యక్షతన నిర్వహించారు. వివిధ గ్రామాల్లో 221 మంది నూతన పింఛనుదారులకు పార్టీ నాయకులు పింఛన్లు అందించారు. తంటికొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రాంబాబు(రెడ్డి), బద్దిరెడ్డి అప్పన్న దొర, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, నరాలశెట్టి నర్సయ్య, రౌతు జోగేశ్వరరావు, బత్తుల శ్రీను, సింబోతుల శ్రీను, దొడ్డి నాగేశ్వరరావు, బత్తుల నానాజీ పాల్గొన్నారు.



కోటనందూరులో గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

మండలానికి 136 కొత్త పింఛన్లు మంజూరు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు మండలానికి ఈ నెలలో కొత్తగా 136 పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు తెలిపారు. గత డిసెంబర్ నెల వరకు మండలంలోని 23 సచివాలయాల పరిధిలో 11,919 మంది లబ్ధిదారులు ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్య 12,055 మందికి చేరిందన్నారు. మండలంలో లబ్ధిదారుల కోసం ప్రభుత్వం రూ.3,58,54,500 నిధులు మంజూరు చేసిందని వివరించారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజల చెంతకే వైద్య సేవలు



జి.కొత్తపల్లిలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సౌమ్యశ్రీ

శంఖవరం: ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ప్రజలకు వైద్యం మరింత చేరువైందని పి.మల్లాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు. మండలంలోని జి.కొత్తపల్లిలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. రోగులకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేశారు. కౌమార దశలో ఉన్న యువతుల్లో రక్తహీనత ఉంటే ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ చేశారు. వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలకు వెళ్లే చిన్నారులను పరీక్షించారు. ప్రస్తుతం వర్షాకాలంలో తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. 70 మంది సాధారణ రోగులు, 20 మంది గర్భిణులు, ఇద్దరు బాలింతలు, 50 మంది మధుమేహ బాధితులు, 60 మంది రక్తపోటుతో బాధపడుతున్న వారికి సేవలు అందిచామని వైద్యాధికారి సౌమ్యశ్రీ తెలిపారు.

పేద మత్స్యకారులకు ఆర్థిక సహాయం



పెరుమాళ్లపురంలో మత్స్యకారులకు ఆర్థిక సహాయం అందిస్తున్న అరబిందో ఫార్మా కంపెనీ ప్రతినిధులు

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురంలో నిరుపేద మత్స్యకారులకు శుక్రవారం అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సహాయం అందించింది. కేఎస్ఈజెడ్ పరిధిలోని మత్స్యకార గ్రామాలకు చెందిన 29 మంది మత్స్యకారులకు సముద్రంలో వేటకు అవసరమైన వలలు, ఇంజన్లు, తదితర సామగ్రి కొనుగోలు నిమిత్తం ఈ సాయం అందించింది. అరబిందో అనుబంధ కంపెనీ లైఫియస్ ఫార్మాలిమిటెడ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ వెంకటరావు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. తీర గ్రామాల ప్రజలకు అరబిందో ఫార్మా కంపెనీ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గంగిరి అడివియ్య, గంటా మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

విస్తృతంగా ఎస్ఈబీ దాడులు



కత్తిపూడిలో పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా దాడులు నిర్వహించి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. కిర్లంపూడి మండలం కృష్ణవరంలో సారా స్థావరాలపై దాడులు చేసి సారా తయారీకి సిద్ధం చేసిన 700 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని అబ్బిరెడ్డి రాజుపై పరారీ కేసు నమోదు చేశారు. శంఖవరం మండలం కత్తిపూడిలో సారా బట్టీలపై దాడులు నిర్వహించి, 1,000 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో కందిపల్లి అర్జునరావుపై పరారీ కేసు నమోదు చేశారు. కాగా కిర్లంపూడి, ప్రత్తిపాడు మండలాలల్లో వివిధ సారా కేసుల్లో నిందితులుగా ఉన్న 15 మందిని అదుపులోకి తీసుకుని బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో కాకినాడ సెబ్ సీఐ పి. సునీల్ కుమార్, టాస్క్‌ఫోర్స్ వింగ్ ఎస్సై జె.విజయ్‌కుమార్, స్థానిక సెబ్ ఎస్సై బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయోధ్యరాముని పాదుకయాత్ర



వెదురుపాకలో అయోధ్యరామయ్య పాదుకయాత్ర నిర్వహిస్తున్న భక్తులు



ఏలేశ్వరంలో అక్షతలు పంపిణీ చేస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు



తాళ్లూరులో కోలాట ప్రదర్శనతో అక్షతలను ఊరేగిస్తున్న దృశ్యం

గోకవరం: మండలంలోని వెదురుపాకలో శుక్రవారం అయోధ్య రాముని దివ్యపాదుక యాత్ర నిర్వహించారు. సనాతన ధర్మ ప్రబోధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు తోట సాయిబాబు, కొరిపల్లి అప్పలస్వామి ఆధ్వర్యంలో గ్రామస్తులు పాదుకలను శిరస్సుపై ఉంచుకుని వీధుల్లో యాత్ర నిర్వహించారు. ఈ నెల 22న అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు అక్షతలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ, పిల్లంగోరు పాపారావు, కొరిపల్లి శ్రీశైలం, బొడ్డు వెంకటేశ్వరరావు, మడక వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షతల పంపిణీ

ఏలేశ్వరం: పట్టణంలో శుక్రవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అయోధ్య రాముని అక్షతల పంపిణీ చేశారు. స్థానిక రూపులమ్మ అమ్మవారి ఆలయంలో అక్షతల పంపిణీని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి శ్రీరాముని జన్మభూమి అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను ప్రజలకు అందజేశారు. ఈ నెల 22న అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవం రోజున ఈ అక్షతలను శిరస్సుపై వేసుకోవాలని సూచించారు. అనంతరం రామాలయ క్యాలెండర్, కరపత్రాలను వితరణ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు కటకం కిరిటీ, ఏడీబీ ప్రసాద్ మహిళలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని ఏలూరులో ప్రజలకు శుక్రవారం ఆర్ఎస్ఎస్, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అయోధ్యరాముని అక్షతలు పంపిణీ చేశారు. ఆర్ఎస్ఎస్ నాయకుడు పెట్లు కొండబాబు ఆధ్వర్యంలో సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అక్షతలను, ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ అక్షతలను పూజా మందిరంలో భద్ర పరచుకోవాలని, ఈ నెల 22న శిరస్సుపై చల్లుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామభక్తులు చెరుకు శ్రీను, కొట్టేటి మధు, మణికంఠ, వీరబాబు, జానకీ రామయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: మండలంలోని తాళ్లూరులో శుక్రవారం అయోధ్య రాముని అక్షతలు, కరపత్రాలు పంపిణీ చేశారు. తొలుత గ్రామంలో మహిళల కోలాటం, బ్యాండ్ మేళాల నడుమ స్వామివారి అక్షతలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అక్షతలు అందజేశారు. అయోధ్యలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ వివరాలను ప్రజలకు వివరించారు.

గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు



ములగపూడిలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న అధికారులు

ప్రత్తిపాడు: కేంద్ర, రాష్ట్ర ప్రభుతాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎవరికైనా వర్తించకపోతే సచివాలయంలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు సూచించారు. మండలంలోని ఏలూరు, టి. రాయవరం గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు రొంగల సత్యనారాయణ, తటవర్తి సుబ్బారావు అధ్యక్షతన శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధికారులతో సంకల్ప యాత్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం లబ్ధిదారులకు ఆరోగ్య శ్రీ హెల్త్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తటవర్తి రామన్నదొర, మండల పశువైద్యాధికారి సుంకర వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు బి.కామరాజు, ద్విభాష్యం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు దాడిశెట్టి చక్రధర్, బీజేపీ నాయకులు శింగిలిదేవి సత్తిరాజు, కందా వీరాస్వామి, మదినే బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

రౌతులపూడి: కేంద్ర ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.గోవిందు సూచించారు. మండలంలోని ములగపూడి, శృంగవరం గ్రామాల్లో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్రలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉజ్వల యోజన, పీఎం కిసాన్ యోజన తదితర పథకాలను అర్హులను గుర్తిస్తున్నట్టు తెలిపారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి వీర రాఘవరావు, హౌసింగ్ ఏఈ ప్రసాద్, ఎంఈఓ శ్రీనివాస్, జానకీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గోకవరంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర

గోకవరం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. తొలుత దేశ సంస్కృతీ సాంప్రదాయాలు ఉట్టిపడేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం దేశప్రగతికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలకూరి రామ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్ట మంగరాజు, జగ్గంపేట కన్వీనర్ దాట్ల సాహితివర్మ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

తుని: ప్రస్తుత చలికాలంలో వృద్ధులకు వెచ్చదనం కోసం దుప్పట్లను పంపిణీ చేసినట్టు అలయన్స్ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు కె.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. పెంటకోట రోడ్డులోని సాయి వృద్ధాశ్రమంలో 40 మందికి అల్పాహారంతో పాటు టాయిలెట్ కిట్లు, దుప్పట్లు, కొత్త సూరవరం వినాయకుడి గుడివద్ద 30 మందికి దుప్పట్లు అందజేశారు. క్లబ్ ప్రతినిధులు పి.సత్యనారాయణ, కుచ్చర్లపాటి భీమరాజు, నామన రవి, నాగరాజు, నాగేశ్వరరావు, కంకిపాటి రాము, జీవీ నాయుడు, రామ్ సుందర్, జీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి మరింత భరోసా

జగ్గంపేట: ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతో పేదల ఆరోగ్యానికి మరింత భరోసా కలిగిందని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం పేర్కొన్నారు. మండలంలోని మల్లిసాలలో శుక్రవారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. డాక్టర్లు రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పని చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ అత్తులూరి నాగబాబు, గ్రామ సర్పంచ్ సర్వసిద్ధి నూకరత్నం, అత్తులూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు

గండేపల్లి: నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ చలగళ్ల దొరబాబు పేర్కొన్నారు. గండేపల్లిలో శుక్రవారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు గాను ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.25 లక్షలకు పెంచిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, వైద్య సర్పంచ్ రుత్తల లలిత పాల్గొన్నారు.

సమర్థవంతమైన పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న పల్లంరాజు

తుని: దేశంలో సమర్థవంతమైన పాలన కాంగ్రెస్‌తోనే సాధ్యమని సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ కేంద్ర మంత్రి ఎంఎం పల్లంరాజు అన్నారు. తునిలో శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన పాలక వర్గ సమావేశం డాక్టర్ చిలుకోటి పాండురంగారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పల్లంరాజును కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ పాండురంగారావు, ఇతర కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజార్టీని సాధిస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకుడు ఇంటి వీరభద్రారావు, తదితరులు పాల్గొన్నారు.

అరుణాచలం గిరి ప్రదక్షిణకు బస్సు సర్వీసు

తుని: అరుణాచలం గిరి ప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం తుని ఆర్టీసీ డిపో నుంచి సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ ఎస్.కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ప్రతి నెలా పౌర్ణమికి ముందు రోజు తుని నుంచి బస్సు బయలు దేరుతుందన్నారు. విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం, అరుణాచలం గిరి ప్రదక్షిణ, కంచి క్షేత్రాలను దర్శించుకోవచ్చునన్నారు. భక్తులు రిజర్వేషన్ టికెట్ల కోసం 73829 13216, 73829 13016 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



అద్దరిపేటలో బాధితులకు ఆర్థిక సహాయం అందించిన శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు

తొండంగి: మండలంలోని అద్దరిపేటలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం ఆర్థిక సహాయాన్ని అందించారు. బాధితుడు మైలపల్లి రాంబాబు కుటుంబ సభ్యులకు శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నేమాల శ్రీనివాసరావు రూ.10 వేలు నగదును అందజేశారు. కార్యక్రమంలో శ్రీస్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు శివాజీ, ఈశ్వర్, నూకరాజు, దుర్గాప్రసాద్, శ్రీనివాస్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం

తుని రూరల్: మండలంలోని ఎస్ఎస్‌వీ నగరంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై బీజేపీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రగడ చక్రరావు, నియోజకవర్గ కో ఆర్డినేటర్ లాలం లోవరాజు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బొట్టా ధనలక్ష్మి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బీజేపీ నాయకులు యాదాల రమణ, గాడి జమీలు, తాటిపర్తి బాబురావు, ప్రగడ ఈశ్వరరావు పాల్గొన్నారు.